"అదన్న మాట విషయం..!" కుర్చీలో వెనక్కి వాలి అన్నాడు భరణి.

"అవును" అన్నాను.

"మరి ఈ విషయంలో నువ్వేం చేయదల్చుకున్నావ్?"

"ఇందులో నేను చేసేదేముంది...? ఆ పోస్టు నాకు వస్తుందనే అనుకుంటున్నాను."

నా జవాబు విని భరణి నా వైపు అదోలా చూశాడు.

"నీ టాలెంటు మీద నమ్మకం లేక కాదు. కానీ రాఘవరావు ఏ ప్రయత్నం చేయకుండా ఊరుకోడుగా...?"

భరణి మాటలకు ఆలోచనలో పడ్డాను.

మా ఆఫీసులో సెక్షన్ సూపర్‌వైజర్ పోస్టు ఒకటి ఖాళీ అయింది. సీనియర్ అసిస్టెంట్‌ని ఆ స్థానానికి ప్రమోట్ చేయమని మా ఎం.డి.గారి ఆదేశాలు. ఆఫీసులో ఉన్న సీనియర్ అసిస్టెంట్లు నాతో సహా నలుగురు. అందులో ఇద్దరి సర్వీసు బాగా తక్కువ.


నేను, రాఘవరావు ఒకేసారి ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్లుగా జాయినయ్యాం. అంతేకాదు. ఖాళీలు రావడంతో ఇద్దరికీ ఒకేసారి సీనియర్ అసిస్టెం



ట్లుగా ప్రమోషన్ రావడం యాదృచ్ఛికం. ఇప్పుడు మా ఇద్దరిలో ఎవరికి ప్రమోషన్ ఇచ్చి సెక్షన్ సూపర్‌వైజర్ చేస్తారా అన్నది విషయం.


ఈ విషయం గురించి మా మేనేజర్‌గారు ఇప్పటికే ఎం.డి.గారితో మాట్లాడారు. ఆ సారాంశం కూడా మాకు తెలిసిపోయింది. అదేవిటంటే ఇద్దరిదీ ఒకటే సర్వీస్ కాబట్టి మేనేజర్‌గారి విజ్ఞత ప్రకారం మా ఇద్దరిలో ఎవరు సమర్థులని భావిస్తారో వారికి ప్రమోషన్ ఇవ్వాల్సిందిగా ఎం.డి.గారు ఆదేశాలిచ్చారు. అంటే ఇప్పుడు బంతి మేనేజర్‌గారి కోర్టులో ఉందన్నమాట.

నేనయితే ఈ ప్రమోషన్ నాకే వస్తుందన్న ఆశాభావంతో ఉన్నాను. రెండు మూడుసార్లు మేనేజర్‌గారు నా వర్క్ ప్రాంప్ట్‌గా ఉంటుందనీ, పైకొచ్చే లక్షణాలు ఉన్నాయనీ మెచ్చుకోవడమే దానిక్కారణం. మరి ఏం జరుగుతుందో చూడాలి. ఈ విషయం గురించే నేనూ, భరణి క్లబ్‌లో కూర్చొని చర్చించుకుంటున్నాం. భరణి ఆఫీస్, మా ఆఫీస్ ఒకే కాంప్లెక్స్‌లో ఉన్నాయి. ఆ కాంప్లెక్స్‌లో ఉన్న ఆఫీస్‌లన్నింటికీ కలిపి ఓ రిక్రియేషన్ క్లబ్ ఉంది. ఆ క్లబ్‌లోనే ప్రస్తుతం మేం కూర్చొని ఉన్నాం.



## బిజీ బిజీగా సిద్ధార్థ!

ఇటీవల వచ్చిన 'చక్‌దే ఇండియా'లో హాకీ కోచ్‌గా నటించాడు షారుఖ్ ఖాన్. రాబోయే 'గోల్' సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా నటిస్తున్నాడు జాన్ అబ్రహాం. ఇప్పుడు మరో హీరో మరో ఆట ప్రధానాంశంగా తయారయ్యే సినిమాలో నటిస్తున్నాడు. కేరమ్స్ ఆట ఇతివృత్తంగా సాగే 'స్ట్రయికర్' సినిమాలో సిద్ధార్థ నటించబోతున్నాడని బాలీవుడ్ సమాచారం. దీనికి గ్రౌండ్ వర్క్ అంటే కేరమ్ ఆట బాగా ప్రాక్టీసు చేయడం దానికి సంబంధించిన మరిన్ని వివరాల సేకరణ లాంటి వాటితో సిద్ధార్థ బిజీగా వున్నాట్ట.




భరణి నాకు ప్రాణమిత్రుడు. ఇద్దరిదీ ఒకే ఊరు. ఇంటర్ వరకూ ఒకే దగ్గర కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత కొంతకాలం వేరైనా ఇప్పుడు మళ్లీ ఉద్యోగ రీత్యా దగ్గరయ్యాం.

"ఏమైనా నువ్వు మీ మేనేజర్ని ఎలాగోలా మంచి చేసుకొని ఆ పోస్టు నీకే దక్కేలా చేసుకోవడం మంచిది" సలహా ఇచ్చాడు భరణి.

భరణి సలహా నాకు నచ్చలేదు.

"చూడు భరణీ! నా సంగతి నీకు బాగా తెలుసు. ప్రమోషన్ వస్తే రానీ... లేకపోతే లేదు. కానీ కాకా పట్టడం లాంటి పనులు నేను చేయలేను. పైగా మా మేనేజర్ అలాంటి వాడు కాదు కూడా" అన్నాను.

భరణి నా వంక విసుగ్గా చూశాడు.

"ఇదే నీతో గొప్ప చిక్కురా.. ప్రతీ విషయానికి ముక్కుసూటిగా పోతానంటావ్.. సెక్షన్ సూపర్‌వైజర్ అయ్యే అర్హత నీకుంది. అలాంటప్పుడు మీ మేనేజర్ని ఓసారి కలిసి ఆ పోస్టు నీకు వచ్చేలా చూడమని మర్యాదపూర్వకంగా అడిగితే తప్పేముంది?"

"అలా అడిగితే ఆయన రివర్సులో పోవచ్చు. ఆయనసలే తిక్క మనిషి ఎవ్వరి మాటా వినే రకం కాదు..."

భరణి కొద్దిక్షణాలు మౌనంగా ఉన్నాడు. మనసులోనే ఏదో గుణించుకొంటున్నాడు.

"అవును.. అదే సరైన దారి." హఠాత్తుగా గట్టిగా అన్నాడు.

ఓ మూల కారమ్స్ ఆడుతున్న వాళ్లు, ఇంకో పక్క కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్న వాళ్లు వాడి అరుపుకి ఒక్కసారి మా వైపు తిరిగి చూశారు.

"ఏంట్రా ఆ దారి..? ఎందుకలా అరిచావ్?" విసుక్కొంటూ అడిగాను.

"బ్రహ్మాండమైన ఐడియా .. మనం విస్మయానంద బాబా దగ్గరికెళ్లాలి."

"విస్మయానందబాబా... ఆయనెవరు?!" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆయన ఏ సమస్యకైనా పరిష్కారం చూపిస్తారట. నేనూ ఆయన గురించి ఈమధ్యే విన్నాను. చాలా పవర్‌ఫుల్ బాబా అట. టౌన్‌కి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది ఆయన ఆశ్రమం. ఈ ఆదివారం ఎలాగూ నేను వెళ్దామనుకొంటున్నాను. నాతో పాటు నువ్వూ వస్తున్నావ్. ఏదైనా కోరిక కోరుకుని ఆయనిచ్చిన తాయెత్తు కట్టుకొంటే ఆ కోరిక తప్పకుండా తీరుతుందట."

వాడి మాటలు విని నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

"చూడూ.. తాయెత్తు కట్టుకొంటే ప్రమోషన్ వస్తుందన్న నమ్మకం నాకు లేదు. నా గురించి తెలిసి కూడా ఇలాంటివి చెప్తావేం?"

నేనేమంటానో ముందే ఊహించినట్టుగా భరణి నా వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఒరేయ్.. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు? ప్రతీదాన్ని అలా కొట్టిపారేయకు.. బాబా ఆశీర్వచనం ఫలించి ప్రమోషన్ వచ్చిందనుకో అదృష్టమే కదా.. సపోజ్. నీ రాత బాలేక రాలేదనుకో జస్ట్ .. ఐదొందల ఖర్చు.. అంతేగదా" వేదాంతిలా అన్నాడు.

"ఐదొందల ఖర్చేమిటి?" అర్థం కానట్టు అడిగాను.

"ఓ.. నీకు చెప్పలేదు గదూ.. బాబా దర్శనానికి మినిమం ఫీజు అది."

"ఎందుకురా ఇలాంటివన్నీ నమ్ముతావు? నీలాంటి వాళ్లుండబట్టే ఇలాంటి వ్యాపారాలు దివ్యంగా సాగిపోతున్నాయి. ఇంతకీ ఆదివారం బాబా దగ్గరికి నువ్వెందుకు వెళ్లాలనుకుంటున్నావు. ఏం కోరుకోవాలని నీ ఉద్దేశం?"

భరణి నవ్వాడు.

"ఒక కోరికనేమిటి? చాలా ఉన్నాయనుకో.. అయినా ముందస్తుగా నా నడుంనొప్పి తగ్గాలని కోరుకుంటాను. ఎన్ని మందులు వాడినా, ఏ వైద్యం ఫాలో అయినా ఈ వెధవ నడుంనొప్పి తగ్గడం లేదనుకో" అన్నాడు.

"సరే నువ్వే వెళ్లు. నేను మాత్రం అక్కడికి రాను."

"ఒరేయ్. నీకు నచ్చజెప్పాలని చూస్తాను చూడు.. అంతకంటే పిచ్చితనం మరోటి లేదనుకో.." కోపంగా అన్నాడు వాడు.

"ముందు నువ్వెళ్లి వస్తావుగా. నీ కోరిక నెరవేరితే అప్పుడు నే[నా]వడం సంగతి ఆలోచిద్దాంలే" అన్నాను.

"ఔనౌను.. అప్పటికి రాఘవరావు సెక్షన్ సూపర్‌వైజర్ అయి కూర్చుంటాడు."

"అబ్బ.. ఈ ప్రమోషన్ సంగతి మేనేజర్‌గారు కేంప్ వెళ్లి వచ్చాకనే డిసైడ్ చేస్తారని తెలిసింది లేరా.. ఆయన రేపు కేంప్‌కెళ్తున్నారు. వచ్చేసరికి పది రోజులు పడుతుంది." అన్నాను.

"సరే నీ ఇష్టం. పద" అంటూ లేచాడు భరణి.

ఇద్దరం పార్కింగ్ ప్లేస్ వైపుగా నడవసాగాం.

★★★

నాల్రోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం...

ఆఫీస్ నుండి ఇంటికొచ్చి రిఫ్రెష్ అయ్యాక తీరిగ్గా టీవీ చూస్తున్నాను. సెల్ రింగయింది. చూస్తే భరణి నుంచి కాల్. నాల్రోజుల నుంచీ వాడు కలవనే లేదు.

"ఏమిటి సంగతి.. బాబా దగ్గరకు వెళ్లావా లేదా?" అడిగాను.

"బాబా సంగతి తర్వాత.. నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు.

"ఏమిటది..? చెప్పు.." అడిగాను.

"ఫోన్లో కాదులే.. రేపు ఆఫీసయ్యాక కలుద్దాం."

"సరే.. అలాగే కలుద్దాం" అన్నాను.

★★★

మర్నాడు ఆఫీసయ్యాక నేను భరణి ఆఫీసు వైపు వెళ్లబోతుంటే వాడే ఎదురుగా వస్తూ కనిపించాడు. క్లబ్‌లో వెళ్దామంటే వద్దన్నాడు భరణి. ఇద్దరం బళ్లు తీసి దగ్గర్లో ఉన్న పార్క్‌కెళ్లి కూచున్నాం. "ఏమిటి సంగతి" అడిగాను.

"నీకు అదృష్టరత్నాల సంగతి తెలుసా?" మెడమీద గోక్కుంటూ అడిగాడు భరణి.

"ఈమధ్య టీవీలో తెగ పబ్లిసిటీ చేస్తున్నారుగా.. ఏదో మన జాతకానికి సరిపడ రత్నం ధరించాలనీ.. దానివల్ల మన సమస్యలు తీరి అంతా శుభప్రదంగా ఉంటుందనీ..."

"అదే..అదే.. దాని గురించే చెప్తున్నాను. నువ్వు అర్జెంటుగా నీ జాతకానికి సరిపడ రత్నం ధరించాలి" ప్యాంటు కొంచెం పైకి మడిచి మోకాలి మీద బరబరా గోక్కుంటూ అన్నాడు.

"దీని గురించి చెప్పడానికేనా.. ముఖ్యమైన విషయం ఉందన్నావ్.. ఇలాంటివన్నీ నాకు సరిపడవని నీకు తెల్సి కూడా మళ్లీ మళ్లీ అలాంటి ఐడియాలే చెప్తావేం?" విసుగ్గా అన్నాను.

భరణి నుంచి సమాధానం రాలేదు.. వాడి వంక చూసేసరికి వీపు మీద గోక్కోడానికి విఫలయత్నం చేస్తూ బిజీగా ఉన్నాడు.

"ఏంట్రా నాయనా.. చూస్తుంటే నీకు పెద్దఎత్తున దురదలు పట్టుకొన్నట్టున్నాయి. ఏం జరిగింది..?" అడిగాను.

"ఏం చెప్పమంటావ్ లే.. ఆదివారం బాబా దగ్గరకు వెళ్లానా..? ఆయనో మంత్రం ఉపదేశించారు.. ఓ తాయెత్తు కూడా ఇచ్చారు. మూడు రోజుల పాటు ప్రతీరోజూ సూర్యోదయానికి ముందే లేచి చెరువులో లేదా నదిలో స్నానం చేసి తాయెత్తు గుప్పిట్లో పట్టుకొని నూట ఎనిమిది సార్లు మంత్రం జపించమన్నారు. మూడో రోజు మంత్రం జపించిన తర్వాత తాయెత్తు చేతికి కట్టుకోమన్నారు. సరిగ్గా అలాగే చేశాను.."

"కానీ మన నగరంలో చెరువెక్కడుందిరా..?" వాడి మాటలకు అడ్డు తగుల్తూ అన్నాను.

"అబ్బ.. నేనుండే ఏరియాకు మూడు కిలోమీటర్ల దూరంలో ఓ చెరువుంది లేరా.. ప్రతీరోజూ తెల్లవారుఝామునే బండి తీసుకొని అక్కడికే వెళ్లేవాణ్ని."

"ఓహో.. అర్థమైంది.. దాని ఫలితమేననుకుంటాను ఈ దురదలు.." నవ్వుకొంటూ అన్నాను.

"అవున్రా. నడుంనొప్పి తగ్గడం సంగతేమో కానీ దురదలు పట్టుకొన్నాయి."

"ఈమాత్రానికేనా అక్కడికి నన్ను రమ్మని పోరు పెట్టావ్." సీరియస్‌గా అడిగాను.

"ఛ..ఛ.. ఇలాంటి చిన్న విషయాలకే బెదిరిపోతే ఎలా? ఆయన మీద నాకు నమ్మకం ఉంది. ఇలాంటి వాటిలో ఫలితాల కోసం తొందరపడిపోకూడదు.." వివరిస్తున్నట్టుగా అన్నాడు.

"సరే.. నింపాదిగానే వేచి చూడు." అన్నాను.

## తిరిగొచ్చిన పుస్తకం

కేంబ్రిడ్జిలోని సిడ్నీససెక్స్ కాలేజీ లైబ్రరీ నుంచి ఎవరో ఒక పుస్తకాన్ని తీసుకున్నారు. ఎక్కడ ఏం పొరపాటు జరిగిందోగానీ వారి అనుయాయులు 288 సంవత్సరాల తరువాత ఆ పుస్తకాన్ని భద్రంగా ఆ లైబ్రరీకి చేర్చారుట.


## విల్లమ్ములతో బ్యాంకు కాపలా

జార్ఖండ్‌లో బ్యాంకు సెక్యూరిటీ గార్డులు లాఠీలతో కాపలా కాస్తున్నారుట. గత మూడేళ్లల్లో రాష్ట్రంలో 50 బ్యాంకు దోపిడీలు జరిగాయి. ఇటీవల కొందరు దుండగులు పంజాబ్ నేషనల్ బ్యాంకును దోచారు. దీనితో మేనేజర్ సెక్యూరిటీ గురించి గోల పెడితే గార్డులకి విల్లు, బాణాలు, కొడవళ్లు లాంటి ఆయుధాల్ని సమకూర్చి సద్దుకోమంటున్నారు పై అధికారులు.

## తాగుడు తెచ్చిన తంటా

బీహారులోని అర్వాల్ జిల్లాలో పెళ్లికొచ్చిన పెళ్లికొడుకు తప్పతాగి అతిథులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఊళ్లోవాళ్లు అతన్ని మెడపెట్టి బయటకు గెంటేసారు. బుద్ధిమంతుడిలా కనిపిస్తున్న పెళ్లికొడుకు తమ్ముడితో తమ పిల్లని పెళ్లాడతావా అని ఆమె తల్లిదండ్రులు అడిగారుట. ఒప్పుకున్న వెంటనే అతనికిచ్చి పెళ్లి చేసేసారుట. తరువాత స్పృహ తెచ్చుకున్న పెళ్లికొడుకు తన తాగుడువల్లనే ఇలా జరిగిందని, ఇకనుంచి తనని ఏ అమ్మాయీ పెళ్లాడదని లబోదిబోమన్నాడుట.

-తటవర్తి



"అబ్బ.. నువ్వసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నావ్.. నేనేం చెప్తున్నా నంటే నువ్వు అదృష్టరత్నం ధరించి తీరాలి..''

"ఒరేయ్.. నా ప్రమోషన్ విషయంలో నీకున్న శ్రద్ధ చూస్తుంటే నిజంగా నాకు చాలా సంతోషంగా ఉందిరా..'' ఆనందంగా అన్నాను.

"సర్లె.. సర్లె.. నీకు ప్రమోషనొస్తే కనీసం త్రీస్టార్ హోటల్‌లో పార్టీ ఖాయం గదా..''

"దానికేం భాగ్యం.. తప్పకుండా..'' హామీ ఇచ్చేస్తూ అన్నాను.

"సరేగానీ నేనుచెప్పేది పూర్తిగా వినడం లేదు నువ్వు.. నిన్ను ఉంగరం ధరించమనడం వెనుక బలమైన కారణం ఉంది.'' అన్నాడు భరణి.

"కారణమా... ఏమిటది..?'' అడిగాను.

"అదే చెప్పబోతున్నాను.. నిన్న ఆఫీసయ్యాక శాంతి జ్యూయెలర్స్‌కు వెళ్లాను.. మా అమ్మాయి కోసం గొలుసు ఆర్డరిచ్చాను.. అది తీసుకోవడానికి వెళ్లాను. ఆ షాపు సంగతి నీకు తెలుసనుకుంటాను.. జాతకం ప్రకారం అదృష్ట రత్నాల్ని అమ్మడంలో ఆ షాపు స్పెషల్. అక్కడ రాఘవరావుని చూశాను. డిస్పాచ్ కౌంటర్‌లో ఒక ఉంగరాన్ని తీసుకొంటున్నాడు. పచ్చ పొదిగిన ఉంగరం అది.. 'నిజంగా దీని ప్రభావం కనిపిస్తుందంటారా..?' అని అడుగుతున్నాడు."

"మీరు చెప్పిన వివరాల ప్రకారం పెర్‌ఫెక్టురత్నం ఇదే సార్.. ఖచ్చితంగా ప్రభావం చూపెడుతుంది'' అని షాపువాడు భరోసా ఇస్తున్నాడు.. అంటే విషయం నీకు అర్థమైందనుకుంటాను.. రాఘవరావు ప్రమోషన్ విషయంలో అనుకూల ఫలితం రావడానికే ఉంగరం తీసుకొని ఉంటాడు.. అతను నన్ను గమనించలేదనుకో.. అయినాగానీ ఇప్పుడు చెప్పు.. నువ్వు కూడా అదృష్ట రత్నం ధరించాల్సిన అవసరం ఉందా.. లేదా? రాఘవరావు ప్రయత్నాన్ని మనం సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే నువ్వు కూడా ఖచ్చితంగా రత్నం ధరించాలి.'' నిర్ణయం జేస్తూ అన్నాడు భరణి.

"రత్నం ధరిస్తే ప్రమోషన్ వస్తుందంటావా?'' అడిగాను.

నా ప్రశ్న విని భరణికి కోపం వచ్చింది.

"ప్రశ్నలనవసరం.. రత్నం ధరించి తీరాల్సిందే. నీకు నమ్మకం లేకపోయినంత మాత్రాన నష్టమేమీ లేదు'' అన్నాడు.

చివరికి నాకు ఇష్టం లేకపోయినా భరణి మాటలకు తలొగ్గి ఒప్పుకోక తప్పలేదు. అయినా రాఘవరావు, నేను ఇద్దరం అదృష్ట రత్నాలు ధరిస్తే మరి అదృష్టం ఎవరిని వరిస్తుంది..? నాకర్థం కాలేదు.

షాపులవాళ్లు తమ సేల్స్ పెంచుకోవడానికి మాత్రమే ఉపయోగించే జిమ్మిక్కుల్లో ఇదొకటని నా నమ్మకం.

★★★

మరుసటిరోజు సాయంత్రం శాంతి జ్యూయెలర్స్‌కి వెళ్లాం. అక్కడ పుట్టిన తేదీ, సమయం వగైరా వివరాలు చెప్తే ధరించాల్సిన రత్నం ఏదో వాళ్లే సూచిస్తారు. ఆ వివరాల ప్రకారం నేను ధరించాల్సిన రత్నం కనక పుష్యరాగం అని చెప్పారు. నేను ముత్యం పొదిగి ఉన్న నా పాత ఉంగరాన్ని ఇచ్చి దాంట్లో ముత్యం తీసేసి కనకపుష్యరాగం పెట్టమని చెప్పాను.

రెండ్రోజుల్లో నా చేతికి కొత్త ఉంగరం వచ్చింది.

తర్వాత వారం రోజుల్లో మా మేనేజర్ కేంప్ నుండి వచ్చేశాడు. ఆయన కేంప్ నుండి వచ్చిన రెండో రోజు ప్రమోషన్ ఆర్డర్స్ రెడీ అయ్యాయని మాకు తెలిసింది. ఆ రోజు లంచవర్ దాటాక మేనేజర్ గారి దగ్గర నుండి కబురొచ్చింది నాకు. ప్రమోషన్ నాకే వచ్చిందన్న సంగతి బహుశా మేనేజర్ పిలుపుతో ఖాయమవుతుందనుకున్నాను.

పది నిమిషాల తర్వాత మేనేజర్ రూమ్‌లో నుంచి బైటకు వచ్చి నా సీట్‌లో కుర్చున్నాక కూడా అసలేం జరిగిందో.. ఎలా జరిగిందో నాకు అర్థం కాలేదు.


"ప్రమోషన్ రాఘవరావుకి ఇస్తున్నామనీ, నిరాశపడవలసిన పని లేదనీ.. త్వరలోనే అకౌంట్స్ సెక్షన్‌లో సెక్షన్ ఆఫీసర్ పోస్టు ఖాళీ అవనుందనీ అప్పుడు ఆ పోస్టులోకి మిమ్మల్ని పంపించే ఆలోచన ఉందనీ అకౌంట్స్ సెక్షన్‌లో మీరు ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నామనీ'' మేనేజర్ వివరించారు. తనను బుజ్జగించడానికి చెప్పినట్టుంది తప్ప అకౌంట్స్ సెక్షన్‌లో ఇంత త్వరగా సెక్షనాఫీసర్ పోస్టు ఖాళీ అయ్యే సూచనలు లేవు.. అకౌంట్స్ సెక్షన్‌లో కూడా సీనియర్స్ ఉన్నారు. అప్పుడు ఎం.డి.గారి నిర్ణయం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? అసలిలా ఎందుకైంది? నా వర్క్ పెర్‌ఫెక్టుగా ఉంటుందనీ, కంపెనీలో మంచి పొజిషన్‌లోకి వెళ్లే అవకాశం ఉందనీ మేనేజర్ గారు రెండు మూడుసార్లు నాతో అన్నారు. మరిప్పుడు ఏమైంది? నిజానికి రాఘవరావుతో పోలిస్తే నేను మంచి వర్కర్ అని ఆఫీసులో అందరికీ తెలుసు.

ఏదేమైనా ఈ షాక్ లోంచి కోలుకోవడానికి నాకు కొంత సమయం పడుతుంది. భరణికి విషయం చెప్పకుండా సాయంత్రం కలుద్దామని ఫోన్ చేసి



## రియల్ హీరో!

'జోధా అక్బర్' షూటింగ్‌కి హాజరయ్యేందుకుగాను హృతిక్ ఏకంగా ఓ చిన్నపాటి విమానాన్నే అద్దెకు తీసుకున్నాడట. ఇందుకుగాను అతనికి 60 లక్షలు ఖర్చయితే దాన్ని తన జేబు నుంచే చెల్లించాట్ట. ఇలా ఎయిర్‌క్రాఫ్ట్‌లో వెళ్లడం వల్ల ముంబాయి నుంచి 100 కిలోమీటర్ల దూరంలో వేసిన సెట్స్‌కి వెళ్లేందుకు కేవలం ఇరవై నిమిషాలే పట్టేదిట. దాదాపు రోజుకి మూడు గంటల టైము కలిసొచ్చేందుకు ఇలా ఖర్చు చేసాట్ట. దాన్ని నిర్మాతపై రుద్దకుండా తన సొంత డబ్బునే ఇచ్చి రియల్ హీరో అనిపించుకున్నాడు.



చెప్పాను. సాయంత్రం విషయం తెలుసుకున్నాక వాడు కూడా నివ్వెరపోయాడు. నాకు ప్రమోషన్ ఖాయంగా వచ్చేసినట్టే అనుకుంటున్నాడు వాడు.. ఎందుకంటే అదృష్టరత్నాల సంగతి పక్కన పెట్టినా వర్క్ పరంగా చూసినా మేనేజర్ నన్నే ఎన్నిక చేస్తారని వాడి ఉద్దేశం.

"ఆ రాఘవరావు ఏదో చేసి ఉంటాడన్నాడు'' భరణి.

"ఛ..ఛ.. అలాటిదేమీ జరిగుండదు.. మా మేనేజర్ సంగతి నాకు తెలుసు.. ఆయన అలా లొంగే రకం కాదు..'' అన్నాన్నేను.

***

తర్వాత నెల రోజులు ఎలాంటి ప్రత్యేకతా లేకుండా గడిచిపోయాయి.

ఒక రోజు ఆఫీసులో ఉండగా భరణి ఫోన్ చేసి "నువ్వు ఊహించలేని విషయం ఒకటి చెప్తాను. సాయంత్రం కలుద్దాం'' అన్నాడు.

ఏం చెప్తాడు.. ఇంతకీ దేని గురించి..? అనుకుంటూ సాయంత్రం భరణిని కలుసుకున్నాను.

భరణి చెప్పిన విషయం మొత్తం విన్న తర్వాత నివ్వెరపోవడం నావంతైంది.

ఇంతకీ భరణి చెప్పింది ఏమిటంటే.. "ఈమధ్య భరణి వాళ్లావిడ జయ బరువు పెరిగిపోవడంతో డాక్టరు సలహా మేరకు ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్తోందట. మా మేనేజర్ వాళ్లుండేది కూడా భరణి ఉంటున్న శ్రీనగర్‌లోనే. మేనేజర్ భార్య కూడా వాకింగ్‌కు వస్తోందిట. జయ, మేనేజర్ భార్య ఆ రకంగా ఫ్రెండ్స్ య్యారు. మేనేజర్ భార్యకి జాతకాల పిచ్చి ఎక్కువట. తను కొత్తగా చేయించుకున్న అదృష్టరత్నంతో కూడిన ఉంగరాన్ని జయకు చూపించిందట.. అది ఒక పచ్చ పొదిగిన ఉంగరం. నిజానికి ఆ ఉంగరాన్ని తన భర్త ఆఫీసులో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ రాఘవరావు తనకు ఇచ్చాడనీ, అతనికి జాతకాల్లో మంచి ప్రవేశం ఉందనీ, తన జాతక చక్రం, జన్మనక్షత్రం తీసుకొని వాటి ప్రకారం తనకు ఆ ఉంగరాన్ని తయారు చేయించి ఇచ్చాడనీ, దానికయిన ఖరీదును తను ఇవ్వబోయినా తీసుకోలేదనీ, కాకపోతే ఆఫీసులో అతనికి ప్రమోషన్ వచ్చే విధంగా ఒక మాట మేనేజర్‌గారితో చెప్పమని కోరాడనీ చెప్పిందట. ఆ విషయమంతా జయ భరణితో చెప్పింది.

భరణి చెప్పింది విన్న తర్వాత నాకు ఒక్కొక్క విషయం మంచు విడిపోయినట్లుగా అర్థం అవుతోంది. అప్పుడప్పుడూ ఆఫీస్ ఫైళ్ల మీద అర్జెంటుగా మేనేజర్‌గారి సంతకాలు కావల్సి వచ్చినప్పుడు మేనేజర్‌గారు సెలవులో ఉండి ఇంటి దగ్గర ఉంటే ఆ ఫైళ్లను రాఘవరావుకిచ్చి మేనేజర్ ఇంటికి పంపించడం అసిస్టెంట్ మేనేజర్‌కి అలవాటు. దానిక్కారణం రాఘవరావు ఇల్లు మేనేజర్‌గారింటికి దగ్గర కాబట్టి. అయితే ఈ రకంగా మేనేజర్ ఇంటికి వెళ్లినప్పుడు మేనేజర్ భార్య జాతకాల పిచ్చిని గమనించి, తనకూ జాతకాలంటే ఆసక్తి అని, జాతకాలు చూడటంలో ప్రవేశం ఉందనీ చెప్పి ఆమెను ఇంప్రెస్ చేశాడన్న మాట. సరైన సమయంలో ఆవిడ జాతకానికి తగిన అదృష్టరత్నం ఉంగరం చేయించి ఆమెకు ప్రెజెంట్ చేసి, ఆవిడ సిఫార్సుతో తన ప్రమోషన్ ఖాయం చేసుకున్నాడు

మేనేజర్‌గారు ఆఫీసులో పులే గానీ ఇంట్లో మాత్రం భార్య మాట జవదాటని పురుషోత్తముడు అని అప్పుడప్పుడు ఆఫీసులో అనుకునే మాటలు గుర్తొచ్చాయి నాకు. అంతే కాదు... అప్పుడే మరో విషయం కూడా నాకు తట్టింది. రాఘవరావు పచ్చపొదిగిన ఉంగరం తీసుకున్నాడని భరణి చెప్పిన మరుసటి రోజు నేను రాఘవరావు చేతిని గమనించాను. అతని చేతికి పచ్చ పొదిగిన ఉంగరం ఏదీ కనిపించలేదు. బహుశా ఉంగరాన్ని పూజలో పెట్టడం లాంటిదేమైనా చేశాడేమో.. తర్వాత పెట్టుకొంటాడని అనుకున్నాను. తర్వాత నేను ఆ విషయమే మర్చిపోయాను. ఇప్పుడు ఆలోచిస్తోంటే గుర్తుకొస్తోంది.. రాఘవరావు చేతికి తర్వాత కూడా అలాంటి ఉంగరం చూసిన గుర్తు లేదు నాకు. అయినా ఆ ఉంగరం మేనేజర్ భార్య చేతిని అలంకరించి ఉంటే అతని చేతికి ఎలా కనిపిస్తుంది?

"ఆ రాఘవరావు ఇలాంటిదేదో చేసి ఉంటాడని నేను అనుమానిస్తూనే ఉన్నాను. నువ్వే మీ మేనేజర్ ఎవరికీ లొంగడు.. అదీ.. ఇదీ.. అని నన్ను దబాయించేశావు.. అసలు ఈ సంగతి మనకు ముందే తెలిసుంటే గనక...'' భరణి ఏదేదో చెప్తున్నాడు.

భరణి మాటలేవీ నా తలకెక్కడం లేదు. నా ఆలోచనల్లో నేనున్నాను.. "నిజంగా రాఘవరావు ఎంత చక్కగా ప్లాన్ చేశాడు..!? సరైన సమయంలో సరైన పథకాన్ని అమలుచేశాడు. ఆఫీసు వర్క్ విషయంలో అతనికంటే నేను ఎఫిషియెంట్ అయితే అవ్వొచ్చు.. దానివల్ల లాభమేముంది? ఈ రోజుల్లో ఎలాంటి విషయాల్లో ఎఫిషియంట్‌గా ఉండాలో నాకిప్పుడు బాగానే అర్థమైంది.. అంతేకాదు అదృష్టరత్నం నుంచి అదృష్టాన్ని ఎలా పొందాలో రాఘవరావుకి బాగా తెలుసుననే విషయం కూడా నాకు చక్కగానే అర్థమైంది.

★

## మిరకిల్

క్రోషియాలో 53 సంవత్సరాల లూగి పెట్రోనీ అనే ఇటాలియన్ విమానం నుంచి పేరాజంపింగ్ చేసాడు. 2000 అడుగుల ఎత్తునుంచి క్రిందకి దూకుతుంటే అతని పేరాచ్యూట్లు రెండూ తెరుచుకోలేదుట. అయితే అతను తిన్నగా అప్పుడే బాగా దున్నిన పొలంలోకి వెళ్లి పడ్డాడట. తరువాత ఆసుపత్రిలో అతన్ని చెకప్ చేస్తే ఒంటిమీద కాస్త గీరుకోనయినా లేదు. అంతెత్తునుంచి అతను ప్రాణాలతో బయటపడడం కేవలం మిరకిల్ అన్నారు డాక్టర్లు.

## సూదులతో రికార్డు

అస్సాంలో 51 సంవత్సరాల దిలీప్ భరద్వాజ్‌కి మెడికల్ షాపు వుంది. అతని భార్యకి ఇంజెక్షన్ అంటే భయం. అది పోగొట్టాలని తన ఒంటిమీద సూదుల్ని గుచ్చుకునేవాడు అతను. ఆ అలవాటు ఎంతకి దారి తీసిందంటే ఒంటినిండా సూదుల్ని గుచ్చుకుని ప్రదర్శించడం అతనికో హాబీగా మారింది. గతంలో ఒక చైనీస్ ఆక్యుపంక్చర్ స్పెషలిస్టు ఒకేసారి 3600 సూదుల్ని గుచ్చుకుని గిన్నిస్‌బుక్ రికార్డులోకి ఎక్కితే ఇటీవల దిలీప్ దుర్గాపూజ సమయంలో 6,146 సూదుల్ని గుచ్చుకుని చూపరుల్ని ఆశ్చర్యపరిచాడు. తన పొట్టమీద ఒక పద్మాకారంలోనో, సీతాకోకచిలుకగానో ఆ సూదుల్ని గుచ్చుకోడం అతని ప్రత్యేకత. ఇది అతని సాహసానికి, ఓర్పుకి తార్కాణమంటున్నారు డాక్టర్లు.

-తరువర్తి

